సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

14న హనుమత్ జయంతి


కొలువైన ఆంజనేయ స్వామి

మహారాణిపేట: మెయిన్‌రోడ్డు శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో ఈనెల 14న హనుమత్ జయంతి నిర్వహించనున్నట్లు దేవాలయ ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 216 చెల్లించిన వారి పేరు, గోత్ర నామాలతో శ్రీ స్వామి వారి పూజ నిర్వహిస్తున్నామన్నారు. వారికి లడ్డు, పులిహోర, సింధూరం అందజేస్తామన్నారు.

యూజీడీ కనెక్షన్లకు వినతి


పెర్రీరోడ్డులో ప్రజలతో మాట్లాడుతున్న మహ్మద్ సాధిక్

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లు ఇప్పించాలని కోరుతూ వార్డు ప్రజలు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్‌ను కోరారు. సోమవారం పెర్రీరోడ్డులో పర్యటించిన సాధిక్ ప్రజల సమస్యలు విన్నారు. మురికివాడ కావడం, రహదారులు చిన్నగా ఉండడంతో యూజీడీ కనెక్షన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఫిర్యాదు చేయడంతో వెంటనే సాధిక్ సంబంధిత అధికారులతో మాట్లాడి యూజీడీ కనెక్షన్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాశీ ప్రసాదం పంపిణీ


ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డులోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కాశీ పుణ్యక్షేత్ర ప్రసాదాన్ని సంఘ సేవకుడు ద్రోణంరాజు శ్రీ వత్సవ్ పంపిణీ చేశారు. సంస్థలో స్వర్గస్తులైన వారందరికీ కాశీలో పిండప్రదానం చేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వైద్యులపై ఆరోపణలు అవాస్తవం

- రైల్వే సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి

తాటిచెట్లపాలెం : రైల్వే వైద్యులపై ఇటీవల వస్తున్న తప్పుడు ఆరోపణల్లో వాస్తవం లేదని ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే డివిజనల్ ఆస్పత్రి సీనియర్ వైద్యులపై బదిలీ అయిన వైద్యుడు తప్పుడు ఆరోపణలతో కేసులను పెట్టి తమ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇదే వ్యక్తిపై గతంలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో జోనల్ రైల్వే పాలనా కేంద్రం వేరే డివిజన్‌కు బదిలీ చేసిందన్నారు. బదిలీ విషయం తెలుసుకున్న సదరు వైద్యుడు తొలుత అనారోగ్యంతో ఉన్నట్లు తప్పుడు సమాచారం అందించారని, ఉన్నతాధికారులు నిజాలు తెలుసుకుని నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. దీంతో అతను కటక్‌లోని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ నుంచి తాత్కాలిక స్టే తెచ్చుకున్నట్టు తెలిసిందన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో పనిచేసి, సస్పెండైన ఓ ఉద్యోగి సాయంతో మీడియా ముందుకు వచ్చి ఎస్సీ, ఎస్టీలపై రైల్వే అధికారులు వేధింపులు చేస్తున్నారని చెప్పడం ఆక్షేపణీయమన్నారు. విధుల నుంచి వేటు పడిన వారు చేసే తప్పుడు ఆరోపణలపై చర్యలుంటాయన్నారు. అవినీతి, బ్లాక్‌మెయిల్, తప్పుడు ప్రవర్తనపై న్యాయపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

అవకతవకలకు చెక్

- జీవీఎంసీ డంపింగ్ యార్డులో ప్రక్షాళన చర్యలు
- జీరో లెవల్‌కు వచ్చిన చెత్త
- పాతనగరవాసులకు ఊరట


డంపింగ్ యార్డులో జీరో లెవల్‌లో ఉన్న చెత్త

జగదాంబ: జీవీఎంసీ డంపింగ్ యార్డు (ఎంఎస్ఎఫ్)లో అవకతవకలకు ముకుతాడు పడింది. జోన్–4 పరిధిలో ఉన్న ఈ యార్డుకు వచ్చే క్లాప్ వాహనాలు, టారెస్‌లు, టిప్పర్ల వివరాల నమోదులోను, అక్కడి నుండి డంపింగ్ యార్డుకు చెత్త తరలించే లెక్కల్లోనూ అనేక అవకతవకలు జరిగేవి. జీవీఎంసీ నిర్దేశించిన స్థాయిలో చెత్త డంపింగ్ యార్డుకు తరలించకుండానే తరలించినట్లు తప్పుడు లెక్కలు నమోదు చేసేవారు. అలాగే వార్డులకు చెత్త సేకరణ నిమిత్తం వెళ్లే క్లాప్ వాహనాల లెక్కల్లోనూ కచ్చితత్వం ఉండేది కాదు. ఇటువంటి అన్ని విషయాలపై జీవీఎంసీ అధికారులు స్పందించారు. క్లాప్ వాహనాలు రోజు ఉదయం 6 గంటలకే వార్డులకు తరలించడంతో పాటు, యార్డుకు వచ్చే చెత్త యార్డులో మిగలకుండా ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలిపోయేలా చర్యలు తీసుకున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు..

జీవీఎంసీ డంపింగ్ యార్డులో సీసీ కెమెరాలు లేకపోడంతో అక్కడి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవరించేవారు. వచ్చే వాహనాలు, వెళ్లే వాహనాల లెక్కలు మసిపూసి మారేడుకాయ చేసేవారు. కొన్ని వాహనాలు అయితే యార్డులోని పార్కింగ్‌లోనే ఉండిపోయినా.. అవి వార్డుల్లో తిరిగినట్లు రాసుకునేవారు. రికార్డులన్నీ చేతిరాతవే కావడంతో సిబ్బంది నచ్చినట్లు ప్రవర్తించేవారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ ఉన్నతాధికారులు యార్డులో ఎనిమిది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ ప్రధాన


యార్డులో ఏర్పాటు చేసిన కెమెరాలు (వృత్తంలో)

కార్యాలయం నుంచి నేరుగా వాటిని పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో అవకతవకలకు ముకుతాడు పడడమే కాకుండా సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించేలా అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి.

వైఎస్సార్‌సీపీ చలవే..

యార్డు ద్వారా వచ్చే దుర్వాసన, వ్యాధులు, ఇబ్బందులను గమనించిన అప్పటి ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్‌సీపీ చేసిన ధర్నాల వలనే నాడు రూ.9 కోట్లతో క్లోజ్డ్ కాంపెక్ట్ (చెత్త తరలించే) వాహనాలు కొనుగోలు చేశారు. ఇప్పుడు యార్డులో చెత్తను జీరో లెవల్‌కు తీసుకు రావడంలో అవే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. దీంతో పాతనగరవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యార్డు నుండి దుర్వాసన రాకపోవడంతో తిన్నది సహిస్తుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి కోరుతూ ఎమ్మెల్యే వినతి


కమిషనర్ సాయికాంత్‌వర్మకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, విల్లూరి


మేయర్ హరివెంకటకుమారికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ రాణిబొమ్మ జంక్షన్ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ, 35వ వార్డులో రూ.50 కోట్లతో మున్సిపల్ స్టేడియంకు మరమ్మతులు, జనతా బజార్‌ను జీ+త్రీగా ఆధునికీకరణతో పాటు సత్యనారాయణస్వామి ఆలయానికి వెళ్లే ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, జనతాబజార్ షాపింగ్ కాంప్లెక్స్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల నుంచి గాజులవీధిని కాపాడండి

జగదాంబ: ఆక్రమణల నుంచి గాజులవీధిని కాపాడండి అంటూ మేయర్ గొలగాని హరివెంకటకుమారికి ఎమ్మెల్యే వాసుపల్లి వినతి అందజేశారు. గాజులవీధిలో స్క్రాప్ దుకాణాల ఆక్రమణల వల్ల అపరిశుభ్రత రాజ్యమేలుతుందన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని అన్నారు. పారిశుధ్య కార్మికులకు శుభ్రం చేయడానికి వీలు లేకుండా రహదారులు ఆక్రమించడం వల్ల కాలువలు దుర్వాసన వెదజల్లుతున్నాయన్నారు. కనీసం అంబులెన్స్‌కు కూడా దారి ఇవ్వడంలేదని మేయర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే జనతాబజార్ వ్యాపారులకు చేయూతనివ్వాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. ఇందిరా మున్సిపల్ క్రికెట్ స్టేడియం చుట్టూ దుకాణ సముదాయాలు నిర్మించి వారిని ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఉన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

‘హుద్‌హుద్’ ఇళ్లు పూర్తి చేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

మహారాణిపేట : హుద్‌హుద్‌లో పూరిపాకల కోల్పోయి రోడ్డున పడ్డ వారికి న్యాయం చేయాలని కోరుతూ సీఐటీయూ గోపాలపట్నం డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. హుద్ హుద్ తుపాన్ సమయంలో గోపాలపట్నానికి చెందిన 228 పాకలు శిథిలమై రోడ్డున పడ్డారని జోన్ కార్యదర్శి బలివాడ వెంకటరావు అన్నారు. వీరికి మధురవాడ సర్వే నెంబర్ 83లో జి.ప్లస్ త్రీ పద్ధతిలో ఇళ్లు నిర్మించారని, కాని ఇప్పటి వరకు 80 శాతం పని మాత్రమే పూర్తి అయిందన్నారు. హుద్‌హుద్ వచ్చి 8 ఏళ్లు దాటినా ఇప్పటి వరకు ఇళ్లు అప్పగించలేక పేదలు ఇబ్బంది పడుతున్నారని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు తెలిపారు. తక్షణం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

దివ్యాంగ బాలలను ఆదుకోవాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన దివ్యాంగ బాలలు

మహారాణిపేట : పుట్టుకతో మూగ, చెవిటి ఉన్న దివ్యాంగ బాలలను ఆదుకోవాలని ఎస్‌కే హాసీనా ఆధ్వర్యంలో దివ్యాంగ బాలలు భారీ సంఖ్యలో కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కాంక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్లు చేయించి, ఉచితంగా అందజేసిన మిషన్లు తరచు రిపేర్లకు గురి అవుతున్నాయని హాసీనా తెలిపారు. రిపేరు నిమిత్తం రూ. 20 వేలు చార్జి చేస్తున్నారని, ప్రభుత్వం తరఫున సర్వీసింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ మిషన్లకు ఉచితంగా సర్వీసు చేయించాలని ఆమె కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

సమస్యలపై ఉద్యోగుల నిరసన


కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న జేఏసీ జిల్లా నాయకులు, రెవెన్యూ ఉద్యోగులు

మహారాణిపేట: ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు సోమవారం ఉదయం కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జేఏసీ నాయకులు కలెక్టరేట్‌లో జరుగుతున్న స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఏపీ అమరావతి జేఏసీ జిల్లా అసోసియేషన్ చైర్మన్ ఎస్.ఎ.త్రినాథరావు, జిల్లా సెక్రటరీ జనరల్, కె.శ్రీనివాసరావు, కోశాధికారి రవిశంకర్, కో చైర్మన్ నమ్మి శ్రీనివాసరావు, కో చైర్మన్ ఎ.శ్రీనివాసరావు, కార్యదర్శి పి.యు.ఎస్.మహేష్, ఏపీఆర్ఎస్ కార్యదర్శి సిహెచ్.వి.రమేష్, వైస్ ప్రెసిడెంట్ శైలజ పాణిగ్రహి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ పేషెంట్‌కు ఎమ్మెల్యే ఆర్థిక సాయం


కిడ్నీ బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు నారాయణవీధికి చెందిన జాగారపు చిన్నా వెల్డర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అతను గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం అతన్ని ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అదే విధంగా క్లస్టర్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం కుమార్తె అనారోగ్యంతో ఓమ్ని ఆర్కే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆయన అక్కడికి వెళ్లి పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, మాదబత్తుల రమేష్, బొడ్డేటి ప్రసాద్, పాల శ్రీహరిరెడ్డి, గారి రాంబాబు, రామరాజు, బొడ్డేటి కిషోర్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి కొత్తమ్మ జాతర


అమ్మవారివీధిలో వెలసిన కొత్త అమ్మవారు

అల్లిపురం: అమ్మవారివీధి కొత్తమ్మ వారి జాతర మహోత్సవాలు మంగళవారం నుంచి నెల రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. దీంట్లో భాగంగా మంగళవారం భూలోకమ్మ పండగ అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం అమ్మవారి సతకం పట్టు నుంచి తిరువీధి ఉత్సవం మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో గోకుల్ థియేటర్ దరి భూలోకమ్మ అమ్మవారి దేవాలయం వరకు కొనసాగుతుందని తెలిపారు. 29వ తేదీన కొత్తమ్మవారి తోళ్ల పండగ, 30వ తేదీన కొత్తమ్మవారి ప్రధాన పండగ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించాలని కోరారు.

జోన్–5 ‘స్పందన’కు 8 వినతులు


సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురం జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 8 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్‌కు 01, పబ్లిక్ హెల్త్‌కు 01, యూసీడీకి 01, రెవెన్యూ విభాగానికి 05 చొప్పున వినతులు అందినట్లు ఆయన తెలిపారు. సకాలంలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసరు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాస్‌రావు, టి.ప్రసన్నరెడ్డి, డీఈ భరత్‌కుమార్, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూలో మందు పార్టీలు!

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో కొంత మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్న సమయంలో మద్యం తాగుతున్నట్లు బయటపడింది. జూ ఎన్ఎంఆర్‌లుగా పని చేస్తున్న కొంతమంది ఎన్‌క్లోజర్ల పక్కన మద్యం తాగుతున్నట్లు రెండు రోజుల క్రితం జూ అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో ఆయా ఎన్ఎంఆర్‌లను అధికారులు నిలదీసినట్లు సమాచారం. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


మజ్జిగ పంపిణీ చేస్తున్న మెకానిక్ యూసఫ్

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు టౌన్‌కొత్తరోడ్డు వద్ద మెకానిక్ దుకాణం నడుపుకుంటున్న యూసఫ్ అనే వ్యక్తి చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిక పంపిణీ చేస్తు ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. ప్రతి ఏటా కూలింగ్ వాటర్ సప్లయ్ చేసేవారమని ఈఏడాది మజ్జిక పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాలి నడకన నగర మేయర్


కాలినడకన కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. తన క్యాంపు కార్యాలయం నుంచి నడుచుకుంటూ ఆర్టీసీ బస్టాప్‌కు చేరారు. సిటీ బస్సు ద్వారా సాధారణ ప్రయాణికుల వలే డబ్బులిచ్చి టిక్కెట్ తీసుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ప్రయాణించి, అక్కడి నుంచి కాలినడకన జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. చాలా మంది అధికారులు సొంత వాహనాల్లో కార్యాలయానికి వస్తున్నట్టుగా తెలిసిందని, సొంత, ప్రభుత్వ వాహనాలు విడనాడి ప్రైవేట్ వాహనాలపై రావాలని మేయర్ ఆదేశించారు.

రుద్రమాజీకి ఎమ్మెల్యే వాసుపల్లి నివాళులు


రుద్రమాజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, తదితరులు

అల్లిపురం: ఇటీవల బస్సు ప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్వరమెట్టకు చెందిన సూరిశెట్టి రుద్రమాజీ దశదిన కర్మ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రుద్రమాజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన కళ్లను దానం చేయడం వలన మరో ఇద్దరికి చూపు ప్రసాదించినవారయ్యారని అన్నారు. కార్యక్రమంలో 33వ వార్డు నాయకులు, అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి వై.రమేష్, బొడ్డేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపును వినియోగించుకోండి


సమ్మర్ క్యాంపు ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి


పాల్గొన్న బాలలు

అల్లిపురం: చిన్నారులు వేసవి సెలవుల నేపథ్యంలో గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి పిలుపునిచ్చారు. అల్లిపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహించనున్న సమ్మర్ క్యాంపును ఆమెతో పాటు ప్రియాంక విద్యోదయ హైస్కూల్ ప్రిన్సిపాల్ డి.భగీరథ్‌కుమార్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పిల్లలకు చందమామ కథలు వినిపించారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనే విద్యార్థులకు కార్టూన్ పుస్తకాలు అందజేస్తానని తెలిపారు. గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు మాట్లాడుతూ సమ్మర్ క్యాంపు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో ప్రతిరోజు కథలు చదవడం, వినడం, హ్యాండ్ క్రాఫ్టేస్, ఆటలు, పాటలు, స్పోకెన్ ఇంగ్లీషు వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపా రు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ జూనియర్ అసిస్టెంట్ జి.పైడిరాజు, సిబ్బంది ఎం.శివశంకరరావు, భీశెట్టి గోపీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో


శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకట్రావు

డాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 రోజుల పాటు రీడింగ్‌తో పాటు సృజనాత్మక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెయింట్ ఆంతోనీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సంజీవకుమార్, డిప్యూటీ లైబ్రరియన్ ఇన్‌చార్జి పీవీ నూకరాజు, లైబ్రేరియన్ ఎల్ఆర్ వర్మ, కార్యాలయ సిబ్బంది పైడిరాజు, జయలక్ష్మి, జహీదా, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల శాఖ గ్రంథాలయంలో..

జీవీఎంసీ 36వ వార్డు పరిధి రంగిరీజువీధిలో గల బాలల శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని గుప్తా డ్రెస్సెస్ ప్రతినిధి రాజారాం ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి పోలితల్లి వేసవి విజ్ఞాన శిబిరం ప్రాముఖ్యత వివరించారు. శిబిరంలో భాగంగా రెండు కథలు, తెలుగు కవుల గూర్చి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ అనంతలక్ష్మి, కె. రాజేష్, పునీత అన్నమ్మ, కె. జయంతితో పాటు 48 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు అవగాహన సభ


తలసేమియా బాధితులకు కిట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ కార్యదర్శి రవికుమార్

మహారాణిపేట : ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థ తలసేమియా బాధితులకు, వారి సంరక్షకులకు అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ తలసేమియా బాధితులకు ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో ఉచితంగా రక్తాన్ని ఇవ్వడమే ఇస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ మానసిక వైద్యురాలు డాక్టర్ జె.పూజిత మాట్లాడుతూ తలసేమియా బాధితులకు వారి సంరక్షకులకు తలసేమియా నివారణ,దాని తరుణోపాయాలను వివరించినట్లు తెలిపారు. అదే విధంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ఆవరణలో స్పందన అర్జీదారులకు సోమవారం భోజన సదుపాయం కల్పించారు. అంధ పాఠశాలల్లో విద్యార్థినులు, నిరాశ్రయులకు హైజిన్ కిట్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి పి.రవికుమార్, పీఆర్వో ఎస్‌కేఎల్ రావు, సభ్యులు ఎండీ రహీమ్‌తుల్లా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.లక్ష్మి, డాక్టర్ మాధవి లత, సంతోష్, మురళీ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జగదాంబ: హార్బర్ పోలీస్ స్టేషన్ పరిధి ఎస్సార్ కంపెనీ వెనుక రోడ్డులో సోమవారం ఓ వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 40 నుంచి 50 సంవత్సరాల వయసు కలిగిన ఆ వ్యక్తి తలకు గాయమై తీవ్ర రక్తస్రావం జరిగి మరణించాడని గుర్తించారు. మృతుడి ఆచూకీ తెలిసి వారు 9440796013, 8985080841 నెంబర్లకు తెలియపరచాలని హార్బర్ పోలీసులు తెలిపారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో ఏయూ విద్యార్థికి స్థానం

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగు విభాగం ఎంఏ తెలుగు ప్రథమ సంవత్సరం విద్యార్థి ఐ.రాణాప్రతాప్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించారు. హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సాహిత్య సంబరాలలో భాగంగా శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొని ‘అమ్మ నా మాతృ భాష’ కవితను రాణాప్రతాప్ వినిపించారు. అతడికి జాతీయ సాహిత్య పురస్కారం, ప్రశంసా పత్రం, జ్ఞాపికతో పాటు కవి శ్రేష్ఠ బిరుదును ప్రదానం చేశారు. అతడిని తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు సోమవారం అభినందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010196663
Office mail : sakshiadvtvsp@gmail.com